ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో సోమవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని, వాటి అమలు తీరును పరిశీలించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హత ఉంటే సచివాలయ సిబ్బందే పథకాలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఇందులో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని గుర్తు చేశారు. పథకాలు అందని వారిని గుర్తించి అర్హులకు పథకాలు అందజేసేలా అధికారులను భాగస్వామ్యులను చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందజేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతి రహిత ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు.

స్వచ్ఛ హిందూపురం లక్ష్యం..

హిందూపురాన్ని సుందరంగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మున్సిపాలిటీతో పాటు గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. 26వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్సీ దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌తో పాటు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రైవేటు స్థలాల్లో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు, అపరిశుభ్రతకు నెలవుగా మారాయన్నారు. వీటిపై మున్సిపల్ కమిషనర్ వెంటనే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులను అందజేసి, అప్పటికి వారు స్పందించకపోతే కేసులు నమోదు చేయాలన్నారు. సీఎం జగనన్న సచివాలయాలకు కేటాయించిన ప్రత్యేక నిధులతో డ్రైనేజీలు, రోడ్లు, వీధి దీపాలు తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. హిందూపురం నియోజకవర్గంలో గత 35 ఏళ్లలో టీడీపీ చేయలేని అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు ఎన్నికలు ఉంటే తప్ప నియోజకవర్గంలో కనబడరన్నారు. ప్రజలకు అందుబాటులో లేని ఆయనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు అయూబ్, మణి, రోషన్ అలీ, ముస్తాక్, మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కోఆప్షన్ మెంబర్ రహమత్, వైఎస్సార్‌సీపీ నాయకులు లతీఫ్ సేట్, కిరోసిన్ బాబు, ఖలీల్, నౌషాద్, చాంద్‌బాషా, సీఎన్‌పీ నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, కట్ల బాషా, సోమశేఖర్‌రెడ్డి, అధికారులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు భరోసా అర్హుల జాబితాల ప్రదర్శన


ఆర్బీకేల్లో జాబితాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని ఆర్బీకేల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాయం పొందేందుకు అర్హుల జాబితాలను ప్రదర్శించామని ఏఓ శ్రీలత సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 7,100 మంది లబ్ధిదారులతో జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. పంటలు వేసి, అర్హుల జాబితాలో పేర్లు లేని రైతుల ఎవరైనా ఉంటే ఈనెల 18వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

మడకశిరరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మడకశిర క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, ఏడీసీఏ అసోసియేషన్ సహకారంతో బుధవారం నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షకుడు విజయకుమార్ సోమవారం తెలిపారు. 8 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల్లోపు ఉన్న బాలురు, బాలికలు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8688446886 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుట్టగొడుగులతో ఆరోగ్యం


పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు

పెనుకొండ: పుట్ట గొడుగులతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని రీసోర్స్ పర్సన్ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని సమతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సోమవారం సమతా సంస్థ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం - తద్వారా వచ్చే ఆదాయంపై నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇచ్చారు. రీసోర్స్ పర్సన్ మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేయొచ్చన్నారు. బీపీ, షుగర్, ఊబకాయం, మలబద్ధకం తదితర రోగాలను నియంత్రిస్తుందన్నారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకం విధానంపై వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, సత్యసాయి కళాశాల ఏఓ ప్రతాప్, నిరుద్యోగులు, సత్యసాయి కళాశాల బీజెడ్‌సీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ప్రతాపరెడ్డి

పెనుకొండ: పెనుకొండ రోడ్డు నుంచి 44వ జాతీయ రహదారికి తిరంగరాయల చెరువుపై నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఎమ్మెల్యే శంకరనారాయణను కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కొండపైకి విద్యుత్ సౌకర్యం, తాగునీటి పైప్‌లైన్ వేయించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాలోమన్

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల పీహెచ్‌సీని సోమవారం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాలోమన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో అన్ని ప్రోగ్రాంలలో సాధించిన ప్రోగ్రెస్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర నాయక్, పీహెచ్‌ఎస్ లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్ రెడ్డి, స్టాఫ్ నర్సులు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాస్ రూట్ ఫుట్‌బాల్ డే

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ అనంతపురం వారి సహకారంతో ఏఎఫ్‌సీ 10వ గ్రాస్ రూట్ డే ఘనంగా జరుపుకున్నారు. లేపాక్షి, పులమతి ఉన్నత పాఠశాలల నుంచి 45 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. వ్యాయమ ఉపాధ్యాయులు రామాంజినేయులు, సురేష్‌బాబు, క్రీడాకారులు అలీం, శృతి, రూపేష్, వెంకటేష్, సుశీల పాల్గొన్నారు.

మనది రైతు పక్షపాతి ప్రభుత్వం


రెడ్డిపల్లిలో భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

రొద్దం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని తెచ్చారని చెప్పారు. రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం ద్వారా రైతుల భూములు రీసర్వే పూర్తి కావడంతో సోమవారం గ్రామ సచివాలయలంలో రైతులకు ఎమ్మెల్యే శంకరనారాయణ చేతుల మీదుగా భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వందేళ్ల తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం స్థిరాస్తులను సమగ్ర భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో భూ సర్వే పూర్తయ్యిందన్నారు. సర్వే నంబర్ల వారిగా హద్దులు గుర్తించి, తగాదాలు లేకుండా ప్రతి నంబర్‌కు ఉచితంగా హద్దురాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. పంచాయతీ వ్యవప్తంగా 722 మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ అనంతచారి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు రామాంజి, ఉజ్జినప్ప, అశోక్‌రెడ్డి, మైలారప్ప, రైతులు పాల్గొన్నారు.

శుభకార్యం

రొద్దం: రెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గోవిందరెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డి లక్ష్మీ చైతన్య, తురకలాపట్నం ముబరఖాన్ కుమారుడి వివాహ వేడుకకు ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు మారుతీ రెడ్డి, ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, ఎంపీటీసీ మాధవిశ్రీనివాస్, రామాంజి, ఉజ్జినప్ప, అశోక్‌రెడ్డి, మైలారప్ప తదితరులు ఉన్నారు.

10 రోజుల్లో హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే

గుడిబండ: మండలంలోని జంబులబండ గ్రామంలో ఈ నెల 5న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మడకశిర ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంబులబండ గొల్లహట్టి, జంబులబండ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. సోమవారం ఎంపీపీ రాధమ్మ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు జంబులబండ గ్రామానికి వెళ్లి రెండు బోరు బావులు తవ్వించారు. రెండు బోరు బావుల్లోను సమృద్ధిగా నీరు లభించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 10 రోజుల్లో సమస్య పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు.


నాలుగు రోజులుగా మృత్యువాత పడుతున్న గొర్రెలు

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో కేతిరెడ్డి ఓంశేఖర్ రెడ్డి అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెలు గత నాలుగు రోజులుగా మృత్యువాత పడుతున్నాయి. వివరాలు.. కేతిరెడ్డి ఓంశేఖర్ రెడ్డి గత 20 ఏళ్లుగా గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 100 గొర్రెల్లో శనివారం 12 గొర్రెలు, ఆదివారం 12 గొర్రెలు ఉన్న ఫలంగా మూర్ఛవ్యాధి సోకినట్లు కృంగిపోయి మృతి చెందాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ పిట్టు పెద్దశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టు పరమేశ్వర్ రెడ్డి తదితరులు ఈ విషయాన్ని పశు వైద్యాధికారి స్వర్ణ దృష్టికి తీసుకెళ్లారు. వెటర్నరీ అసిస్టెంట్ రామాంజినేయులు, గోపాలమిత్ర బాషా తదితరులు సోమవారం గ్రామానికి వెళ్లి గొర్రెలకు మందులు వేశారు. అయితే సోమవారం కూడా నాలుగు గొర్రెలు మృతి చెందగా మరో ఐదు గొర్రెల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వరుసగా గొర్రెలు మృతి చెందుతుండటంతో గొర్రెల కాపరి కుటుంబం ఆందోళన చెందుతోంది. అధికారులు స్పందించి ఉన్న గొర్రెలనైనా కాపాడాలని కోరుతున్నారు.

ఓబుళేశ్వర స్వామి భూముల వేలం

తలుపుల: గంజివారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఓబుళేశ్వర స్వామి భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రాణాప్రతాప్, ఏసీ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో 15 మంది డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. పాపులమ్మ రూ.3.5 లక్షలకు భూములను దక్కించుకున్నారు. ఈ వేలం పాట మొత్తం ఏడాదికి మాత్రమే, అయితే ఇదే విధంగా పై మొత్తాన్ని మూడేళ్ల పాటు చెల్లించి కొనసాగించుకోవచ్చు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు మధు, శివశంకర్ నాయక్, భజరంగ రాముడు, ఎస్ఐలు బందోబస్తు చేపట్టారు.

స్టేషన్ రాజకీయాలు చేస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప

పావగడ: స్థానిక జేడీఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్ష పూరిత పోలీస్ స్టేషన్ రాజకీయాలు చేస్తే సహించేది లేదని జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. స్థానిక జేడీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఓడిపోయామని, ప్రజా తీర్పును శిరసా వహిస్తామని, గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వెంకటేశ్ నియోజక అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే, ఈ ఎన్నికల్లో ఓటమి పాలైన తిమ్మరాయప్ప మాట్లాడుతూ గెలుపు, ఓటములు సాధారణమని ఈ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి జేడీఎస్ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధి పనులకు సహకరిస్తామని, అన్యాయాలు చేస్తే పోరాడతామని హెచ్చరించారు. తమ కార్యకర్తలను అన్యాయంగా కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప మాట్లాడుతూ విపరీతమైన డబ్బులు వెదజల్లి, ఓటర్లను కొనుగోలు చేసి అక్రమ మార్గంలో కాంగ్రెస్ విజయం సాధించిందని దుయ్య బట్టారు. ఆ పార్టీ నాయకుడు ఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ ఫలితాలు వెల్లడైన రెండు రోజులకే నాగలమడక ప్రాంతంలో ఘర్షణలు మొదలయ్యాయని, నాగలాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాలు తీవ్ర తరమయ్యే అవకాశాలున్నాయని ఆందోళన చెందారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బలరామరెడ్డి, నాయకులు సొగడు వెంకటేశ్, చెన్నకేశవ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అంజినప్ప, ఈరణ్ణ, వెంకటేశప్ప, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు జగనన్న విద్యాకానుక కిట్లు


మడకశిర: భవిత కేంద్రంలో జగనన్న కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్


గుడిబండ: జగనన్న విద్యాకానుక కిట్లు సర్దుతున్న సీఆర్‌పీలు

మడకశిరరూరల్/గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు పున: ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలనే లక్ష్యంతో విద్యాకానుక సామగ్రిని సరఫరా చేస్తున్నారు. సోమవారం మడకశిరలోని భవిత కేంద్రంలో విద్యార్థుల యూనిఫారం, బెల్టులు, డిక్షనరీలను నిల్వ చేశారు. ఇప్పటికే 33,777 పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారని, మిగిలిన పాఠ్యపుస్తకాలు సరఫరా అవుతాయని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. అనంతరం ఆయన యూనిఫారంను పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతలో బెస్ట్ అన్నారు. అదే విధంగా రెండో విడత నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే గుడిబండ మండలానికి జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. వీటిని పాఠశాలల వారిగా సీఆర్‌పీలు వేరు చేస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు.

30లోపే జగనన్న విద్యాకానుక చేర్చాలి


ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశమైన జిల్లా సీఎంఓ ఓబులపతి

పరిగి:జగనన్న విద్యాకానుక పథకంతో ప్రభుత్వం అందిస్తున్న విద్యాసామగ్రిని ఈనెల 30 లోపే మండలంలోని అన్ని పాఠశాలలకు చేర్చాలని జగనన్న విద్యాకానుక జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఓబులపతి తెలిపారు. సోమవారం పరిగికి వచ్చిన ఆయన.. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిల్వ ఉంచిన జగనన్న విద్యాకానుక వస్తువులను పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశమై వివరాలను ఆరాతీశారు. ఇప్పటి వరకూ మండలానికి 5,555 జతల యూనిఫారం, 21,609 పాఠ్యపుస్తకాలు, 4,234 బెల్టులతో పాటూ 606 డిక్షనరీలు వచ్చాయన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక అందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ప్రకాష్, అపర్ణ, గంగాధర్, పీటీఐలు మల్లికార్జున, వెంకటేష్, సిబ్బంది శేషు, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఢీకొన్న ద్విచక్ర వాహనాలు


తీవ్రంగా గాయపడిన కిష్టప్ప, ఈరన్న

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. వివరాలు..రొద్దం మండలం కంబాలపల్లికి చెందిన గొల్ల నారాయణప్ప ద్విచక్ర వాహనంపై పెనుకొండ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో పెనుకొండ నుంచి రొద్దం గ్రామానికి మంజునాథ్, అనిత ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గంమధ్యలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

మెళవాయి క్రాస్‌లో మరో ఇద్దరికి..

మడకశిర రూరల్: మండలంలోని మెళవాయి క్రాస్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరేపల్లికి చెందిన క్రిష్టప్ప, జంబులబండ గొల్లహట్టి గ్రామానికి చెందిన ఈరన్న తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల మేరకు.. ఇరువురు ద్విచక్ర వాహనల్లో మడకశిర వైపు నుంచి స్వగ్రామాలకు వెనుక ముందు వెళుతుండగా మెళవాయి క్రాస్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. వైద్యుల సూచన మేరకు ఇద్దరినీ హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైద్య శిబిరానికి స్పందన

రొళ్ల: మండల కేంద్రం గుడిబండ ప్రధాన రహదారి పక్కన గల మురళి పాఠశాల ఆవరణలో సోమవారం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యోగానంద్ ఆధ్వర్యంలో బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రొళ్ల, గుడిబండ, అగళి మండలాల నుంచి వందలాది మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు శశాంక్, సచిన్, శిథల్, హనుమంతయ్య ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఆరుగురు, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఐదుగురు, న్యూరోకు సంబంధించి నలుగురి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడంతో పాటు 285 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ సన్నతిమ్మప్ప, హెచ్‌ఎం నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, రోగులు తదితరులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సోమందేపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బాలస్వామి తెలిపారు. సోమవారం చాకర్లపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజ్ గోపాల్ హనుమయ్య, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)

హిందూపురం	37
పెనుకొండ	41
మడకశిర	37

సీఎం జగన్‌ను కలసిన మధుమతిరెడ్డి


సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం టౌన్: తాడేపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి హిందూపురం మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి సోదరి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, భర్త నాగభూషణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. హిందూపురం ప్రస్తుత రాజకీయ పరిస్థితులను సీఎంకు వివరించినట్లు మధుమతిరెడ్డి తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: పాలసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని కాటేపల్లి, రాగిమేకలపల్లి, సామలపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుంది. ఈమేరకు ఎంపీడీఓ రఘునాథగుప్త, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు కాటేపల్లిలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని వారు కోరారు.

సమస్యలు పరిష్కరించండి

అమరాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు కార్యక్రమంలో రమేష్, తిప్పేస్వామి, కరియమ్మ, నాగమణి, శివప్ప, నాగరాజప్ప, రంగమ్మ, షణ్ముకప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు వంద శాతం పూర్తి చేయాలి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో గర్భిణులు, 19 సంవత్సరాల్లోపు పిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. సచివాలయ వెల్ఫేర్ అధికారులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు సంయుక్తంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం పూరైన గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులను వేగవంతం చేయాలన్నారు. మండలంలోని వలస, హలుకూరు, ఆలదపల్లి, హేమావతి తదితర గ్రామ సచివాలయాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ఆయా గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం టౌన్: వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి, బోయ విద్యార్థులకు ఈనెల 27న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు స్థానిక వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన వారు 450కి పైగా మార్కులు, ప్రైవేటు పాఠశాలలో చదివిన వారు 475కి పైగా మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివి 800లకు పైగా మార్కులు సాధించిన వారు, ప్రైవేటు కళాశాలల్లో చదివి 850కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రాలను ఈనెల 23 సాయంత్రం లోపు 9441665692, 7780583140 నంబర్లకు వాట్సాప్‌లో పంపాలని సూచించారు.